సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 53.610 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 53.610 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 1080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.93,970
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,510
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,765
నవర (8 గ్రాములు)	రూ.70,120

గరిష్టం/కనిష్టం
35.3 /26.5

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 64 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

డీసీపల్లిలో 235 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 535 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 620 బేళ్లు రాగా వాటిలో 535 బేళ్లను విక్రయించామని మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 69605.2 కిలోల పొగాకును విక్రయించగా 1,81,00,844.70 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.240 లభించింది. మొత్తం మీద సగటు ధర రూ.260.05గా నమోదైంది. వేలంలో 13 కంపెనిలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ఇంజినీర్లు బుధవారం తెలిపారు. 1వ యూనిట్లో 570, 2వ యూనిట్లో 610, 3వ యూనిట్లో 570 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని వెల్లడించారు.

4,5 తేదీల్లో రొమ్ము కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరం


నెల్లూరు(అర్బన్): నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ నెల 4, 5వ తేదీల్లో మహిళలకు రొమ్ము కేన్సర్ ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మి, రేడియేషన్ అంకాలజిస్టులు డాక్టర్ గీతాఉషశ్రీ, డాక్టర్ లోకేశ్వరి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 40 ఏళ్ల పైబడిన మహిళలు, కుటుంబంలో బ్రెస్ట్ కేన్సర్ చరిత్ర ఉన్నవారు, రొమ్ములో గడ్డలున్న వారు, నిపుల్ డిశ్చార్జి (రొమ్ము మొనల నుంచి స్రావాలు) ఉన్న వారు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 0861-2341714, 9392341714 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిద్రోతున్న నిఘా

రైలు ప్రయాణికులపై దోపిడీ పంజా

- నేర్వని.. గత ఘటనల గుణపాఠం
- రెండేళ్లుగా ఒక్కరినీ పట్టుకోలేకపోయిన జీఆర్పీ, ఆర్పీఎఫ్
- సిగ్నల్ వ్యవస్థను ట్యాంపర్ చేస్తూ సవాల్ విసురుతున్న ముఠా
- రెండేళ్లలో ఏడు రైళ్లలో దోపిడీలు
- తొమ్మిది నెలల విరామం అనంతరం మరోసారి విజృంభణ
- తాజాగా ఒకే రోజు అల్లూరురోడ్డు, పడుగుపాడు వద్ద సిగ్నల్స్ ట్యాంపరింగ్
- బెంగళూరు ఎక్స్‌ప్రెస్, మధురై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు టార్గెట్
- మధురై రైల్లో చెలరేగిన దుండగులు

రైల్వేలో నిఘా, భద్రతా యంత్రాంగం నిద్రోతుంది. సిబ్బంది కొరత పేరుతో రైల్లో ప్రయాణికుల భద్రతను గాలికి వదిలేస్తున్నారు. ప్రయాణికుల రైళ్లలో రాత్రి వేళలో నిఘా వైఫల్యం దోపిడీ ముఠాలకు వరంగా మారింది. ఇదే అదనుగా దోపిడీ దుండగులు రైల్వే సాంకేతిక టెక్నాలజీని వాడుకుంటూ నిర్మానుష్య ట్రాక్ ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసి దోపిడీ పంజా విసురుతున్నారు. నెల్లూరు రైల్వే పోలీస్ డివిజన్ పరిధిలో గడిచిన రెండేళ్లలో ఆరు రైళ్లల్లో దోపిడీలకు పాల్పడ్డా.. ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేకపోయారు. నిఘా వ్యవస్థ అసమర్థతను సవాల్ చేస్తూ తాజాగా బిట్రగుంట-నెల్లూరు రైల్వేస్టేషన్ల మధ్య రెండు చోట్ల సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రెండు రైళ్లల్లో దోపిడీకి ప్లాన్ చేసినా ఒక రైల్లోనే దోపిడీ చేయగలిగారు.



నెల్లూరు (క్రైమ్)/బిట్రగుంట: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసి దోపిడీలు చేసే ముఠా చెలరేగిపోతోంది. రైలు ప్రయాణికులపై దోపిడీ పంజా విసురుతోంది. ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో విచారణ పేరుతో కొంత కాలం హడావుడి చేసి.. ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారు. ఆయా కేసుల్లో కనీసం ఒక్క దుండగుడ్ని కూడా అరెస్ట్ చేయలేకపోవడంతో రైల్వే పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగాల నిఘా వ్యవస్థలకు ఈ ముఠాలు ఆదమరిచి మరీ సవాల్ విసురుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి నెల్లూరు- బిట్రగుంట రైల్వేస్టేషన్ల మధ్య రెండు రైళ్లను టార్గెట్ చేసి రెండు చోట్ల సిగ్నల్ ట్యాంపరింగ్ చేశారు. ఒక రైల్లో దోపిడీకి విఫలయత్నం చేయగా, మరో రైల్లో దోపిడీకి పాల్పడ్డారు. అదే రైలు మరో స్టేషన్ సమీపంలో నిలిచిపోయింది. అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో అర్ధరాత్రి 11.13 గంటల సమయంలో రైలు పట్టా జాయింట్ (గ్లూడ్ జాయింట్) మధ్య కాయిన్ పెట్టి హోమ్ సిగ్నల్స్ ట్యాంపర్ చేయడంతో హౌరా నుంచి బెంగళూరు వెళ్తున్న 12863 నంబర్ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. అయితే సిగ్నల్ ట్యాంపర్ జరిగిన ప్రాంతానికి రైలు నిలిచిన ప్రాంతానికి మధ్య దూరం ఉండడంతో ఈ రైల్లో దోపిడీ విఫలం అయింది. అదే మార్గంలో గంట సమయం తర్వాత 12.05 గంటల సమయంలో ఛండీగర్ నుంచి మదురై వెళ్తున్న 20494 నంబర్ మదురై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రైలును అల్లూరురోడ్డు స్టేషన్ సమీపంలో చైన్‌లాగి నిలిపివేశారు. రైలు ఆగిన వెంటనే ఎస్-2, ఎస్-4, ఎస్-5 కోచ్‌ల్లో ముగ్గురు మహిళా ప్రయాణికుల మెడల్లోని బంగారు చైన్లు, రెండు బ్యాగులు అపహరించారు. అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ ట్యాంపర్ అయిన విషయం తెలుసుకున్నప్పటికీ రైల్వే యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిఘా వ్యవస్థను అప్రమత్తం చేసి ఉంటే అదే మార్గంలో అదే ప్రాంతంలో గంట సమయం తర్వాత వచ్చిన మరో రైల్లో దోపిడీ జరిగే అవకాశం ఉండేది కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అల్లూరు రోడ్డు స్టేషన్ తర్వాత పడుగుపాడు రైల్వే స్టేషన్ సమీపంలోనే మరో సిగ్నల్ పాయింట్ వద్ద సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి ఉండడంతో దోపిడీకి గురై మదురై ఎక్స్‌ప్రెస్ మరోసారి నిలిచిపోయింది. ఈ ఘటనలు పూర్తిగా రైల్వే స్టేషన్ మాస్టర్ల నుంచి నిఘా వ్యవస్థ వరకు ఘోర వైఫల్యం కనిపిస్తోంది.

రెండేళ్ల నుంచి పంజా విసురుతున్న దుండగులు

సిగ్నలింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి రైళ్లలో దోపిడీకి పాల్పడిన ఘటనలు 2023 నుంచి వరుసగా చోటు చేసుకున్నాయి.

- 2023 జూన్ 24వ తేదీ వేకువన తెట్టు వద్ద సిగ్నలింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి పాల్పడ్డారు.
- రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తుండగానే రెండు నెలల వ్యవధిలో అదే ఏడాది ఆగస్ట్ 14వ తేదీ వేకువన వీరేపల్లి వద్ద చెన్నై ఎక్స్‌ప్రెస్, తెట్టు రైల్వే బ్రిడ్జి వద్ద చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి పాల్పడ్డారు.
- ఇదే తరహాలో సెప్టెంబర్ 16వ తేదీన సింగరాయకొండ వద్ద చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో, సెప్టెంబర్ 18న అల్లూరు రోడ్డు వద్ద పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి విఫలయత్నం చేశారు.
- 2024 జూన్ 12వ తేదీ వేకువన కావలి- శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వే స్టేషన్ల మధ్య చెన్నై వైపు వెళ్లే మార్గంలో వేకువన 1.50 గంటల సమయంలో సిగ్నలింగ్ వ్యవస్థను ట్యాంపర్ చేసి నరసాపురం నుంచి ధర్మవరం వెళుతున్న 17247 నంబరు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైల్లోకి ప్రవేశించిన దుండుగులు ఎస్-13 బోగీ, ఎస్ 11 బోగీల్లో దోపిడీకి పాల్పడ్డారు.
- అదే రోజు అక్కడే మకాం వేసి 2.15 గంటల నుంచి 2.30 గంటల మధ్య షిరిడీ సాయినగర్ నుంచి తిరుపతి వెళుతున్న 07638 నంబరు తిరుపతి స్పెషల్ రైల్లో ఎస్-3, ఎస్-5 కోచ్‌ల్లోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడ్డారు.



పడుగుపాడు సమీపంలో టీఎల్‌జే బాక్స్‌లో వైర్లు ధ్వంసం చేసి సిగ్నల్స్ ఆపేసిన దృశ్యం

నిఘా హడావుడి చేసి..

అప్పట్లో రైల్వే పోలీసులు ఆర్పీఎఫ్, సివిల్ పోలీసుల సహకారంతో నేరాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టారు. రైళ్లలో బీట్ వ్యవస్థను పటిష్టం చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, స్థానిక నేరస్తులతో పాటు ఉత్తర ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ముఠాల కదలికలపై నిఘా పెట్టారు. నేరాలు అధికంగా జరిగే అవకాశమున్న నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో నెల్లూరు సౌత్, నార్త్ (హోమ్ సిగ్నల్ పాయింట్), పడుగుపాడు ఔటర్ సిగ్నల్‌పాయింట్, గూడూరు సౌత్, వెస్ట్ హోమ్ సిగ్నల్ పాయింట్, సింగరాయకొండతో పాటు జాతీయరహదారికి దగ్గరగా ఉండే తలమంచి, మనుబోలు తదితర ప్రాంతాల్లో గస్తీని పెంచారు. నెల్లూరు, ఒంగోలు జిల్లాల్లోని 99 చీకటి ప్రాంతాలను గుర్తించి లైటింగ్ ఏర్పాటు చేశారు. కొద్ది రోజులుగా ఈ తరహా నేరాలు జరగకపోవడంతో నిఘా వ్యవస్థ రిలాక్స్ అయింది. ఇదే అదనుగా దోపిడీ దుండగులు మరోసారి పంజా విసిరారు.

తొమ్మిది నెలల విరామం తర్వాత

తాజాగా మరోమారు తొమ్మిది నెలల విరామం అనంతరం మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అల్లూరు రోడ్డు వద్ద దొంగలు సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి చండీఘర్-మధురై రైల్లో దోపిడీకి పాల్పడ్డారు. ఎస్-2, ఎస్-3, ఎస్-5 కోచ్‌ల్లో రెండు చైన్‌స్నాచింగ్, రెండు బ్యాగ్‌లను అపహరించారు. ఈ సమాచారం అందుకున్న తర్వాత నిదానంగా రైల్వే, ఆర్పీఎఫ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జనార్దన్, సీ సుధాకర్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దోపిడీ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక పోలీసుల సహకారంతో అల్లూరు రోడ్డు స్టేషన్ నుంచి నెల్లూరు, కావలి వైపు సీసీటీవీ పుటేజీలను సేకరిస్తున్నారు.

సిబ్బంది కొరతతో నిఘా గాలికి..



అల్లూరురోడ్డు సమీపంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు

నెల్లూరు రైల్వే డివిజన్ పరిధిలో బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి జిల్లాలు వస్తాయి. 444 కిలోమీటర్ల మేర రైల్వే లైను విస్తరించి ఉంది. నెల్లూరు సర్కిల్ పరిధిలో నెల్లూరు, తిరుపతి జిల్లా (ఉమ్మడి నెల్లూరు జిల్లా)లోని గూడూరు, కావలి రైల్వే పోలీసు స్టేషన్లు ఉన్నాయి. సూళ్లూరుపేట, బిట్రగుంట, కృష్ణపట్నం పోర్టులో అవుట్ పోస్టులున్నాయి. ఒంగోలు సర్కిల్ పరిధిలో ఒంగోలు, బాపట్ల జిల్లాలో (ఉమ్మడి ఒంగోలు)ని చీరాల రైల్వే పోలీసుస్టేషన్లు ఉన్నాయి. సింగరాయకొండలో పోలీసు అవుట్ పోస్టుంది. నెల్లూరు రైల్వే డివిజన్ పరిధిలో 151 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం సుమారు 108 మంది ఉన్నట్లు సమాచారం. రైళ్ల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ అందుకు సరిపడా సిబ్బంది నియామకాలు జరగడం లేదు. ఒకప్పుడు బ్యాగ్, గొలుసు, జేబు దొంగతనాలు జరిగేవి. ప్రస్తుతం నేరస్తులు నూతన పంథాల్లో నేరాలకు పాల్పడుతున్నారు. దోపిడీలు, దొంగతనాలు, మత్తు మందులిచ్చి ఆభరణాలు, నగదు అపహరణ, సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి దోపిడీలకు పాల్పడడంతో పాటుగా గంజాయి, మాదకద్రవ్యాలు, బంగారం, వెండి ఆభరణాల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సిబ్బంది విధుల్లోనూ మార్పులు వచ్చాయి. సిబ్బంది కొరత కారణంగా నేర నియంత్రణ, కేసుల పరిష్కారం వారికి తలకు మించిన భారంగా మారుతోంది. దీంతో ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించలేకపోతున్నారనే అభిప్రాయాలున్నాయి. ఇది నేరగాళ్లకు కలిసొస్తోంది.

ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నమే

- మైనింగ్ కేసులో కాకాణిపై తప్పుడు ఫిర్యాదులు, కేసులు
- జగనన్న మళ్లీ సీఎం అవుతారు.. అందరి లెక్కలు సరిచేస్తారు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మల్లి నిర్మల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మల్లి నిర్మల

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం పాలనా వైఫల్యాలను, తప్పుడు ప్రచారాలను వెలుగెత్తి చూపుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై తప్పుడు ఫిర్యాదులు, కేసులు ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నమని ఆ పార్టీ అధికార ప్రతినిధి మల్లి నిర్మల ధ్వజమెత్తారు. బుధవారం ఆమె బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకాణి నిబద్ధత గల నాయకుడని, ఆయనపై అక్రమ మైనింగ్ కేసు పెట్టడం అధికార పార్టీ నాయకుల కక్ష సాధింపు చర్యలుగా అభివర్ణించారు. నిరాధార ఆరోపణలతో కాకాణిని నిలువరించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన పోరాట పటిమను తట్టుకోలేక అధికార పార్టీ నాయకులు వేధింపులకు గురి చేయడానికే ఈ విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కాకాణి మంత్రిగా ఉన్నప్పుడు అక్రమ మైనింగ్‌పై విచారణ చేయాలని ఆదేశించారన్నారు. అప్పటి అధికారులు విచారణ జరిపి అసలు అక్కడ మైనింగే జరగలేదని నివేదికను అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2003లో అప్పటి మంత్రిగా ఉండి ఒక ఎమ్మెల్యేతో కలిసి అక్రమ మైనింగ్ చేసిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. అప్పటి జిల్లా అటవీ శాఖాధికారి స్వయంగా వాహనాలను సీజ్ చేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. అధికార పార్టీలో ఉండి ఒక బీసీ వర్గానికి చెందిన ఆ అటవీ శాఖాధికారిని టార్గెట్ చేసి అక్రమ బదిలీ చేశారని తెలిపారు. అప్పట్లో బీసీ నాయకులు మూడు రోజులు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేసిన వైనాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. వెంకటాచలంలో జరిగిన దాష్టీకాలను, అల్లీపురంలో నకిలీ విత్తనాలు, ఎరువుల తయారీ, వన సంరక్షణ నిధులను దోచుకున్న వైనాన్ని ప్రజలు మర్చిపోరని, ఎవరు నిబద్ధత గల నాయకుడో ప్రజలకు తెలుసన్నారు. నిరంతరం శ్రమించే తమ నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసును సంబంధించి క్వాష్ పిటిషన్‌తో న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, ఉద్దేశపూర్వకంగా నోటీసులు పంపించడం వేధింపుల్లో భాగం కాదా అని ప్రశ్నించారు. ఐదు సార్లు ఎన్నికల్లో ఓడిపోయి దింపుడు కల్లాం ఆశగా ఈ సారి టికెట్ లభిస్తే గెలుస్తామా?, ఓడిపోతామా అనే సందిగ్ధంలో నుంచి గెలిచి అధికారం ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ఇటువంటి వారి లెక్కలు సరి చేస్తారని చెప్పారు.


13న గురుకుల ప్రవేశపరీక్ష

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పరీక్ష ఈనెల 13న జరగనున్నట్లు జిల్లా సమన్వయకర్త టి.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష 13వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు ఈ నెల 3వ తేదీ నుంచి https://apbragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా తీసుకోవచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకురావాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు విద్యార్థిని, విద్యార్థులు ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకురావాలన్నారు. పరీక్ష సమయానికి ఒక గంట ముందు సంబంధిత పాఠశాలకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

వక్ఫ్ భూములు ఉఫ్

జిల్లాలో వేలాది ఎకరాల వక్ఫ్ బోర్డు భూములు కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. నెల్లూరు నగరం సహా 31 మండలాల్లో వక్ఫ్ బోర్డు భూములు దశాబ్దాలుగా అన్యాక్రాంతంలో ఉన్నాయి. వీటిలో అనేక ప్రాంతాల్లోని భూములు సాగు పేరుతో తీసుకుని రికార్డులు మార్చేసుకుని కొందరు అనుభవిస్తుండగా, మరికొన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించిన భూములు కూడా అన్యాక్రాంతం చేశారు. రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇవ్వడం వివాదాస్పదంగా మారాయి. జిల్లాలో ఒకటి రెండు కాదు దాదాపు 4 వేల ఎకరాల భూమి పరాధీనంలో ఉన్నట్లు వక్ఫ్ బోర్డు అధికారులు గతంలో లెక్క తేల్చారు. ఈ భూములు ఇప్పటికీ వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకోలేకపోయింది. జిల్లాకు చెందిన మైనార్టీ నేత వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా ఉన్నారు. ఆయన ఈ భూముల రక్షణపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

- జిల్లాలో 31 మండలాల్లో 4 వేల ఎకరాల ఆక్రమణలు
- దాదాపు 60 ఏళ్ల నుంచి ఇదే పరిస్థితి
- నెల్లూరు నగరంలోనే అత్యధికంగా 150.60 ఎకరాల భూమి
- ఉదయగిరిలో 340.51 ఎకరాలు అన్యాక్రాంతం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో ఆరు దశాబ్దాలుగా వక్ఫ్ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. నెల్లూరు నగరంలో ఖరీదైన ప్రాంతాలుగా ఉన్న మాగుంట లేఅవుట్, పొగతోటలోనూ వక్ఫ్‌బోర్డు భూములు అధికంగా ఉన్నాయి. జిల్లాలోని 31 మండలాల్లో భూములు ఆక్రమణల్లో ఉన్నాయి. వీటిలో నెల్లూరు నగరంలో 49 సర్వే నంబర్లలో 150.60 ఎకరాల భూమి ఉంది. ఉదయగిరి మండలంలో 5 సర్వే నంబర్లలో 340.51 ఎకరాల భూమి ఆక్రమణల్లో ఉంది. చట్ట ప్రకారం వక్ఫ్ బోర్డు భూముల్ని ఆక్రమించటం నేరం. అయితే జిల్లాలో వక్ఫ్‌బోర్డు ఏర్పాటు కావడానికి ముందు నుంచే ఇనాం భూములు, సర్వీసు భూములు, ముతవలీలకు కౌలుకు ఇచ్చిన భూములను అప్పటి రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా పట్టాలు జారీ చేశారు. రెవెన్యూ రికార్డుల్లో ఉండే ఆర్ఎస్ఆర్ వివరాలను రెవెన్యూ అధికారులు పరిగణలోకి తీసుకోకుండా భూములకు పట్టాలు ఇవ్వడంతో క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. 1954లో కేంద్ర చట్టంను అనుసరించి వక్ఫ్ బోర్డు ఏర్పాటు అయింది. ఏపీ వక్ఫ్ బోర్డు యాక్ట్ 1954 ప్రకారం ధార్మిక కార్యక్రమాలకు, ముతవలీలకు కేటాయించిన సర్వీసు భూములను క్రయ విక్రయాలు చేయడం నేరం అవుతుంది. అయితే చట్టానికి ముందు నుంచే ఆక్రమణ పర్వం కొనసాగుతూనే ఉంది. ఈ విషయాన్ని వక్ఫ్‌బోర్డు అధికారులు అనేక పర్యాయాలు గతంలో టీడీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోని పరిస్థితి. ఈ నేపథ్యంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకునే ప్రయత్నం జరిగింది.

ఎక్కడ.. ఎంతెంత

నెల్లూరు నగరంలోని పొగతోట, మాగుంట లేఅవుట్, సరస్వతీనగర్, ఫత్తేఖాన్‌పేట, స్వతంత్ర పార్క్‌తోపాటు మరికొన్ని కలిపి 150.60 ఎకరాలు ఉన్నట్లు నిర్ధారించారు. అయితే నగరంలో అన్ని ప్రాంతాల్లో దాదాపు అరవై ఏళ్లకు పైబడి నివాసాలు ఉన్నాయి. నెల్లూరు నగరంలో 49 సర్వే నంబర్లలో 150.60 ఎకరాలు, కోవూరులో 34 సర్వే నంబర్లలో 78.79 ఎకరాలు, రాపూరులో 25 సర్వే నంబర్లలో 58.50 ఎకరాలు, విడవలూరులో 91 సర్వే నంబర్లలో 2.00 ఎకరాలు, కొడవలూరులో 5 సర్వే నంబర్లలో 7.14 ఎకరాలు, పొదలకూరులో 11 సర్వే నంబర్లలో 13.61 ఎకరాలు, టీపీ గూడూరులో 13 సర్వే నంబర్లలో 22.01 ఎకరాలు, వెంకటాచలంలో 4 సర్వే నంబర్లలో 13.70 ఎకరాలు, బుచ్చిరెడ్డిపాళెంలో 11 సర్వే నంబర్లలో 53.04 ఎకరాలు, ఆత్మకూరులో 7 సర్వే నంబర్లలో 45.00 ఎకరాలు, ఏఎస్‌పేటలో 14 సర్వే నంబర్లలో 91.33 ఎకరాలు, చేజర్లలో 4 సర్వే నంబర్లలో 96.97 ఎకరాలు, కలువాయి 2 సర్వే నంబర్లలో 74.51 ఎకరాలు, సంగంలో 4 సర్వే నంబర్లలో 11.59 ఎకరాలు, సీతారామపురంలో 5 సర్వే నంబర్లలో 64.49 ఎకరాలు, మర్రిపాడులో రెండు సర్వే నంబర్లలో 19.49 ఎకరాలు, ఉదయగిరి మండలంలో 5 సర్వే నంబర్లలో 340.91, అనంతసాగరం మండలంలో 13 సర్వే నంబర్లలో 32.46 ఎకరాలు, కావలిలో 3 సర్వే నంబర్లలో 140.59 ఎకరాలు, అల్లూరు మండలంలో 2 సర్వే నంబర్లలో 69.92 ఎకరాలు, దగదర్తి మండలంలో 2 సర్వే నంబర్లలో 9.75 ఎకరాలు, కొండాపురం 1 సర్వే నంబర్‌లో 11.43 ఎకరాలు, జలదంకిలో ఒక సర్వే నంబర్‌లో 92.63 ఎకరాలు, కలిగిరిలో 3 సర్వే నంబర్లలో 24.32 ఎకరాలు, వరికుంటపాడు మండలంలో 1 సర్వే నంబర్లో 96.93 ఎకరాలు, కోట మండలంలో 4 సర్వే నంబర్లలో 18.82 ఎకరాలు, వాకాడులో రెండు సర్వే నంబర్లలో 9.65 ఎకరాల భూమి, చిల్లకూరులో 2 సర్వే నంబర్లలో 27.72 ఎకరాలు, సైదాపురం మండలంలో మూడు సర్వే నంబర్లలో 03.92 ఎకరాలు, సూళ్లూరుపేటలో మూడు సర్వే నంబర్లలో 94.84 ఎకరాలు, వింజమూరులో ఒక సర్వే నంబర్లో 95 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి.

వక్ఫ్ బిల్లు ఆమోదంతో ఆస్తుల రక్షణ జరిగేనా?

గతంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌బోర్డులో సంస్కరణలు తెస్తూ తాజాగా కొత్తగా వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా ఆమోదం లభించింది. ఇప్పటి వరకు పూర్తిగా వక్ఫ్ బోర్డు పాలకుల పరిధిలో ఉండే ఆస్తుల సంరక్షణ బాధ్యత ఇక ప్రభుత్వ పరిధిలోకి రానుంది. వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉండగానే ఈ ఆస్తులన్నీ అన్యాక్రాంతం అయ్యాయి. తాజాగా కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌తో ఈ ఆస్తుల రక్షణ జరిగే అవకాశం ఉంటుందా? లేక పరాధీనం జరిగే పరిస్థితులపై వేచి చూడాల్సిందే.

కబ్జాదారుల కబంధహస్తాల్లో వేల ఎకరాలు



జిల్లాలోని వక్ఫ్‌బోర్డుకు సంబంధించి వేల ఎకరాలు కబ్జాదారుల కబంధహస్తాల్లో ఉన్నాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వక్ఫ్‌బోర్డు ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలి. పూర్వీకులు తమ ఆస్తులను వక్ఫ్‌బోర్డుకు ఇచ్చారు. ఆ భూముల నుంచి వచ్చే ఆదాయంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

– షేక్ మొయినుద్దీన్, మైనార్టీ నేత

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించుకోవాలి



జిల్లాలో వక్ఫ్‌బోర్డు భూములు కబ్జాలకు గురవుతున్నాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కబ్జాదారుల నుంచి వక్ఫ్ బోర్డు భూములకు విముక్తి కల్పించాలి. వక్ఫ్ ఆస్తులన్నీ కొందరు పెద్దల చేతుల్లో ఉన్నాయి. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత వక్ఫ్ బోర్డుపై ఉంది.

– మహ్మద్ జుబేర్, మైనార్టీ నేత

వక్ఫ్ భూముల రక్షణ బాధ్యత అందరిది



వక్ఫ్‌బోర్డు భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కర పై ఉంది. అధికారులు కూడా తూతూ మంత్రంగా కాకుండా క్షేత్ర స్థాయిలో కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుని వక్ఫ్‌బోర్డుకు అప్పగించాలి. వక్ఫ్‌బోర్డు పాలక యంత్రాంగం దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– అబ్దుల్ రజాక్, మైనార్టీ నాయకుడు

బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం



నెల్లూరు సిటీ: నగరంలోని ఏకేనగర్ తపాలా కార్యాలయం ముందు ఉండే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి పాక్షికంగా ధ్వంసం చేశారు. ఈ ఘటనను అఖిల భారత తపాలా ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు దుడ్డు రమేష్‌బాబు, అధ్యక్షుడు డీ ఆనంద్ ఖండిస్తూ, ఈ దారుణానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇది పిరికి పందల మతోన్మాదుల చర్య అన్నారు.

11 లోపు అర్హతలు సమర్పించాలి

నెల్లూరు (టౌన్): పల్లిపాడు డైట్ కళాశాలలో ఖాళీ అధ్యాపక పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఈ నెల 11వ తేదీలోపు అర్హతలు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించాలని డీఈఓ బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తు వివరాలు, అందులో పొందుపరిచిన విద్యార్హతల జెరాక్స్ సెట్‌ను స్కూల్ అసిస్టెంట్లు అయితే వారి ప్రధానోపాధ్యాయులకు, హెడ్‌మాస్టర్లు, ఎంఈఓలు అయితే వారి డివిజన్ డిప్యూటీ డీఈఓల ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 9908413409 సీనియర్ అసిస్టెంట్, మనోజ్‌కుమార్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్: అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2025 – 26 రిజిస్ట్రేషన్లను ప్రారంభించినట్లు గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం కల్నల్ పునీత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీలకు సంబంధించి www. joinindianarmy. nic. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈనెల 10వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. ఒక అభ్యర్థి అగ్నివీర్‌లో రెండు వేర్వేరు కేటగిరీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సీనియర్ సెకండరీ రిక్రూట్‌మెంట్ కోసం.. ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెకండరీ రిక్రూట్‌మెంట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుగా కలెక్టర్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్హత గల పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలకు www. joinindiannavy. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో గుర్తుతెలియని వృద్ధుడు ఈనెల ఒకటో తేదీన నెల్లూరు జీజీహెచ్ వద్ద మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి బుధవారం కేసు నమోదు చేశారు. జీజీహెచ్ వద్ద ఆరాతీయగా సదరు వృద్ధుడు తన గ్రామం కసుమూరని చెబుతూ ఉండేవాడని కొందరు తెలియజేశారు. వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00018, 0861 – 2328440 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

శ్రీరామపురంలో వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: ఆరోగ్య సమస్యలతో పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కసుమూరు పంచాయతీ పరిధి శ్రీరామపురంలో బుధవారం గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీరామపురం గ్రామానికి చెందిన బిరుదోలు హరిబాబు (36) కొన్నినెలలుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో నాలుగు రోజుల క్రితం నివాసం నుంచి వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. అయితే గ్రామ సమీపంలోని అడవిలో మృతదేహం ఉండటంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహం పక్కనే పురుగు మందు డబ్బా ఉండటంతో అతని భార్య మాధవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణ డాక్టర్ల క్వార్టర్స్‌లో చోరీ

నెల్లూరు సిటీ: నారాయణ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రాంగణంలోని డాక్టర్ల క్వార్టర్స్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఓ వైద్యురాలికి చెందిన బంగారం, వెండి, నగదును చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. హాస్పిటల్లో డాక్టర్ మంజు విధులు నిర్వహిస్తోంది. డాక్టర్ల క్వార్టర్స్‌లో ఓ ఇంట్లో ఆమె ఉంటోంది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు విధులకు హాజరైంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి 9 సవర్ల బంగారం, ఒకటిన్నర కేజీల వెండి వస్తువులు, రూ.20 వేలు నగదు చోరీ చేశారు. బాధితురాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.110
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.50


నేటి నుంచి 'పది' మూల్యాంకనం

- మొగ్గు చూపని కొందరు అయ్యోర్లు
- ఆరోగ్య కారణాలు చూపి ఎగనామం
- ఎగ్గొటేందుకు సంఘాలు, పలువురితో సిఫార్సు
- కేంద్రంలోకి సెల్‌ఫోన్ల నిషేధం
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం

సాకులు చెబుదాం.. తప్పించుకుందాం..



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ బాలాజీరావు



నెల్లూరు(టౌన్): పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం గురువారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో జరుగుతుంది. 36 గదులను సిద్ధం చేశారు. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు 1,92,920 జవాబుపత్రాలు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. 1,036 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 174 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 348 మంది స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. మూల్యాంకనం చేసిన ఓఎంఆర్ షీట్లను ఏరోజుకారోజు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి పంపనున్నారు. సమగ్రశిక్ష రాష్ట్ర అధికారి రవీంద్రనాథ్ రెడ్డి రాష్ట్ర పరిశీలకుడిగా, డీఈఓ బాలాజీరావు క్యాంప్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించనున్నారు. మూల్యాంకనానికి హాజరయ్యే ఉపాధ్యాయులకు ఐడీ కార్డులను అందజేస్తారు. విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా దానిని ధరించాల్సి ఉంది.

డీఈఓపై ఒత్తిళ్లు

పదో తరగతి మూల్యాంకనానికి హాజరయ్యేందుకు కొందరు ఉపాధ్యాయులు ముఖం చాటేస్తున్నారు. ఈ పని నుంచి ఏదో ఒక విధంగా తప్పించుకునేందుకు రకరకాల పాట్లు పడుతున్నారు. పలువురు ఆరోగ్య కారణాలను సాకుగా చూపెతున్నారు. మరి కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా స్థాయి అధికారుల ద్వారా డీఈఓ బాలాజీరావుపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ వ్యవహారం ఆయనకు తలనొప్పిగా మారింది. మూల్యాంకనానికి ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు వేయాలని నిబంధన పెట్టడం, రోజూ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వహించాల్సి రావడం, పైగా సెల్‌ఫోన్లను కేంద్రంలోకి నిషేధించడంతో ఎక్కువ మంది టీచర్లు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. మూల్యాకనం కోసం నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా నిధులను కూడా విడుదల చేయలేదని సమాచారం. సొంత ఖర్చులతోనే ఏర్పాట్లు చేయాల్సి వస్తోందని జిల్లా విద్యాశాఖాధికారులు మదన పడుతున్న పరిస్థితి ఉంది.

మినహాయింపు లేదు

పది జవాబుపత్రాల మూల్యాంకనానికి డ్యూటీ వేసిన ప్రతి ఉపాధ్యాయుడు హాజరుకావాల్సిందే. ఎవరికీ మినహాయింపు లేదు. విధులకు వచ్చిన వారు ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంది. మూల్యాంకన సమయంలో ఎవరూ సెల్‌ఫోన్‌ను వినియోగించకూడదు. తప్పులు లేకుండా, టెన్షన్ పడకుండా ప్రశాంత వాతావరణంలో జవాబుపత్రాలను దిద్దాలి.

– ఆర్.బాలాజీరావు, డీఈఓ

బాధ్యతగా..

ఒక్కో అసిస్టెంట్ ఎగ్జామినర్ రోజుకు 40 జవాబుపత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంది. వాటిని చీఫ్ ఎగ్జామినర్ పరిశీలిస్తారు. తర్వాత స్పెషల్ ఆఫీసర్ చెక్ చేస్తారు. ఒక్కో పేపర్ మూల్యాంకనం చేసినందుకు రూ.10లు ఇస్తారు. జవాబుపత్రాలను ఎలాంటి తప్పులేకుండా బాధ్యతాయుతంగా దిద్దాల్సి ఉంటుంది. పని ఒత్తిడి, తొందరపాటు, నిర్లక్ష్యం తదితర కారణాలతో మూల్యాంకనంలో తప్పులు దొర్లుతుంటాయి. విద్యార్థి రీ వెరిఫికేషన్ పెట్టినప్పుడు పేపర్ సరిగా దిద్దలేదని, మార్కులు తప్పుగా కౌంటింగ్ చేసినట్లు తేలితే సంబంధిత ఉపాధ్యాయుడిపై రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. ఈ నేపథ్యంలో మూల్యాంకనానికి వచ్చేందుకు కొందరు టీచర్లు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధుల నుంచి తప్పించుకునేందుకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇప్పటికే పలు సంఘాల నాయకులు సిఫార్సు చేసిన వారిని మూల్యాంకన విధుల నుంచి తప్పించినట్లుగా ప్రచారం జరుగుతోంది.

టిప్పర్లు దగ్ధం



మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): చెత్తాచెదారాలు తగులబడటంతో పక్కనే ఉన్న రెండు టిప్పర్లు అగ్నికి దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ఆటోనగర్ సమీపంలో ఓ రోడ్డు పక్కన పెద్ద ఎత్తున చెత్తాచెదారాలున్నాయి. దాని పక్కనే టిప్పర్లు పార్క్ చేశారు. బుధవారం ప్రమాదవశాత్తు అగ్గి రాజుకుందో? లేదా ఆకతాయిలు తగులబెట్టారో తెలియదు గానీ చెత్తాచెదారాలు తగులబడి పక్కనే ఉన్న టిప్పర్లకు నిప్పంటుకుంది. మంటల్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పారు. టిప్పర్లు ఎవరివనే విషయం తెలియరాలేదు.

రైతు బజార్లలో సపోటా అమ్మకాలు

నెల్లూరు రూరల్: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సపోటా అమ్మకాలు చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు జేసీ కార్తీక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట, కావలి, కందుకూరు, పొదలకూరు రైతు బజార్లలో అద్దె లేకుండా ఉచితంగా షాపు కేటాయిస్తామన్నారు. పండ్ల హోల్‌సేల్ వ్యాపారులతో సమన్వయం చేసి రైతులకు ధర వచ్చేలా కృషి చేస్తామన్నారు. వివరాలకు 91823 61236 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆలస్యంగా వచ్చి.. బాధతో వెనుదిరిగి..



ఆలస్యంగా వచ్చి గేటు బయట ఉన్న విద్యార్థులు



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



చైన్ తీస్తున్న విద్యార్థిని

- నెల్లూరులో జేఈఈ మెయిన్స్ పరీక్ష
- ఆలస్యంగా రావడంతో ఏడుగురికి అనుమతి నిరాకరణ

నెల్లూరు(టౌన్): 'ప్లీజ్ సర్.. మమ్మల్ని పరీక్ష కేంద్రంలోకి అనుమతించండి' అంటూ విద్యార్థులు బతిమిలాడుకున్నారు. సమయం మించిపోయిందని సిబ్బంది చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు. బుధవారం నెల్లూరులోని పొట్టేపాళెంలో ఉన్న ఆయాన్ డిజిటల్ సెంటర్ జేఈఈ మెయిన్స్ పరీక్ష జరిగింది. ఇవి ఈనెల 9వ తేదీ వరకు జరుగుతాయి. ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,800 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో పరీక్ష జరిగింది. ఉదయం 7.30 గంటలకే విద్యార్థులను డిజిటల్ సెంటర్‌లోకి అనుమతించారు. ఆ సమయంలో మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేశారు. 8.30 గంటల తర్వాత ఏడుగురు విద్యార్థులు వచ్చారు. తమను పరీక్షకు అనుమతించాలని సెక్యూరిటీ సిబ్బంది, అధికారులను బతిమలాడారు. కుదరదని చెప్పడంతో బాధపడుతూ వెళ్లిపోయారు. మధ్యాహ్నం నుంచి జరిగిన రెండో విడతలో కూడా గంటన్నర ముందుగానే విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించారు.

విద్యార్థుల ప్రాజెక్ట్‌లకు బహుమతులు



ఎక్స్‌పోలో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

నెల్లూరు(టౌన్): నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో ఏపీ ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎండీపీ) 2024 – 25 కార్యక్రమాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ప్రారంభించారు.. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు 8 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రోగ్రాంలో ప్రతిభ చూపిన ఒట్టూరులోని ఏపీఎంఎస్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌కు ప్రథమ, ఇంకా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతి అందజేశారు. సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఈఎండీపీ ఎక్స్‌పో జోనల్ మేనేజర్ నీలిమ, డీసీఈబీ సెక్రటరీ రామ్‌కుమార్, ఆత్మకూరు డిప్యూటీ డీఈఓ జానకిరామ్, ప్రధానోపాధ్యాయులు రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత భవిత

- పాలిసెట్, ఏపీఆర్‌జేసీ అవగాహన సదస్సుకు స్పందన



మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ చదివే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి అన్నారు. బుధవారం ఆ విద్యాసంస్థలో నిర్వహించిన పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ నమూనా పరీక్ష, అవగాహన సదస్సుకు మంచి స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్హతతో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్, ఆర్ అండ్‌బీ, రైల్వే, బెల్, బీఎస్ఎన్ఎల్, ఆర్టీసీ, విద్యుత్ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో, అలాగే కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్, 25న ఏపీఆర్‌జేసీ ప్రవేశపరీక్షలు జరుగుతాయన్నారు. 35 ఏళ్లుగా సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ వంటి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ర్యాంకులు సాధిస్తూ ప్రవేశాలు పొందుతున్నట్లు చెప్పారు. ఆయా పోటీ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

చేసింది కొంత.. ప్రచారం కొండంత

పన్ను వసూళ్ల విషయంలో నెల్లూరు నగరపాలక సంస్థ అధికారులు గొప్పలు చెప్పుకొంటున్నారు. గతంతో పోల్చుకుంటే సాధించిన లక్ష్యం తక్కువైనా వంద శాతం చేసినంతగా ప్రచారం చేసుకుంటున్నారు. సాక్షాత్తు పురపాలక శాఖ మంత్రి నియోజకవర్గంలో నెలకొన్న ఈ పరిస్థితి చర్చనీయాంశంగా మారింది.

- పన్ను వసూళ్లలో భేష్ అట
- సాధించింది 47 శాతమే..
- కానీ వంద శాతం చేసినట్లుగా గొప్పలు
- పురపాలక శాఖ మంత్రి నియోజకవర్గంలో ఇదీ చోద్యం



నెల్లూరు(బారకాసు): స్థానిక సంస్థలకు పన్నుల రూపంలో వచ్చే రాబడి ఎంతో కీలకం. ప్రతి ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా.. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఖజానాను నింపుకోవడం కీలకం. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 2023 – 24 సంవత్సరంలో ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్నుల డిమాండ్ రూ.130 కోట్లు ఉండగా వసూలు చేసింది రూ.66.37 కోట్లు. ఆనాడు సాధించిన లక్ష్యం 51 శాతం. అప్పట్లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మెజార్టీ శాతం సిబ్బంది ఆ విధుల్లో ఉన్నారు. ఓ వైపు ఎన్నికల విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు పన్నుల వసూళ్లను మెరుగ్గా చేశారు. 2024 – 25కు వచ్చేసరికి డిమాండ్ రూ.150 కోట్లకు చేరింది. అంటే గతాని కంటే రూ.20 కోట్లు పెరిగింది. కానీ ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసింది రూ.71.38 కోట్లు మాత్రమే. సాధించిన లక్ష్యం 47 శాతం. గతంతో పోల్చుకుంటే నాలుగు శాతం తక్కువగానే వసూలు చేయగా కార్పొరేషన్ అధికారులు మాత్రం భేష్ అంటూ గొప్పగా ప్రచారం చేసుకోవడం విశేషం.

నాడు వంద శాతం రాయితీ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలపై భారం పడకూడదని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల్లో వంద శాతం వడ్డీ రాయితీ ఇవ్వడం జరిగింది. దీంతో ప్రజలు కూడా సహకరించి పన్నులను చెల్లించడంతో నగరపాలక సంస్థకు రాబడి పెరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 50 శాతం మాత్రమే వడ్డీ రాయితీ ఇచ్చింది. 2024 – 25 ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత పన్నుల వసూళ్లలో రెవెన్యూ విభాగం కృషి అభినందనీయమంటూ అధికారులు కొనియాడారు. వంద శాతం సాధించేసినట్లుగా గొప్పలు చెప్పుకొంటున్నారు. వసూళ్ల శాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల నుంచి చీవాట్లు వస్తాయనే భయంతో భేష్ అంటూ ప్రచారం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రచారం ఎవరి మెప్పుకోసమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సాక్షాత్తు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉంది. పన్నుల వసూలు అనుకున్న స్థాయిలో చేయలేకపోవడంతో ఎక్కడ తమ అసమర్థత బయట పడుతుందననే భయంతో పురపాలక శాఖ మంత్రి వెనుక ఉండి అధికారులచే ఇలా గొప్పలు ప్రచారం చేయించి ఉండొచ్చనే చర్చ జరుగుతోంది.

కూటమి కుట్రలపై న్యాయ పోరాటం

- కేసుపై మైనింగ్ అధికారులకే స్పష్టత లేదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అధికార పార్టీ చేస్తున్న కుట్రలపై న్యాయ పోరాటం చేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పొదలకూరు మండలం తాటిపర్తి గ్రామంలో మైనింగ్‌కు సంబంధించి ఫిబ్రవరి 12, 14వ తేదీల్లో వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డిపై చార్జీషీట్లు పెట్టి ఫిబ్రవరి 16వ తేదీన తనను నిందితుడిగా చేర్చారన్నారు. తాను ఈ కేసుపై 19వ తేదీన హైకోర్టును ఆశ్రయించానన్నారు. 24వ తేదీన కోర్టు ముందస్తు బెయిల్ ఇస్తూ పోలీసులకు సహకరించాలని సూచించిందన్నారు. అప్పటి నుంచి తనను ఏ అధికారి పిలవడం, విచారించడం కానీ జరగలేదన్నారు. అలాంటప్పుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కేసులో తాను అప్రూవర్‌గా మారారంటూ తనపై ఓ ఎలక్ట్రానిక్ ఛానల్ దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. తాను అప్రూవర్‌గా మారుతున్నట్లు అధికారులు, పోలీసులకు చెప్పినట్లు, ఎవరి పేరునైనా చెప్పినట్లు వారి దగ్గర ఏమైనా సాక్ష్యాలుంటే బయట పెట్టాలన్నారు. అప్పటి మైనింగ్ డీడీ శ్రీనివాస్‌కుమార్, ప్రస్తుత డీడీ బాలాజీనాయక్‌లకు ఈ కేసుపై అసలు స్పష్టతే లేదన్నారు. పొంతన లేని నోటీసులతో తమ పార్టీ నేతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డికి మైనింగ్ డీడీ షోకాజ్ నోటీసులు ఇచ్చి రూ.7.56 కోట్లు పెనాల్టీ వేసిన విషయాన్ని గుర్తు చేశారు. తర్వాత బాలాజీనాయక్ తన పేరును కూడా చేర్చి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. విద్యాకిరణ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు బనాయించారన్నారు. అసలు ఓనరే లేని మైన్స్‌లో అక్రమాలు జరిగాయని కేసు పెట్టడం దారుణమన్నారు. ఓనర్ లేనప్పుడు ఆ భూమి ప్రభుత్వానిదని, అందులో ఖనిజ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులదేనన్నారు. అయితే అధికారులు స్పష్టత లేకుండా వెంట వెంటనే ఫిర్యాదులు మార్చి మార్చి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. మాజీ మంత్రి కాకాణి నియోజకవర్గంలో ఆయన అధికారంలో ఉన్నప్పుడు తామేదో చేశామని బురదజల్లే ప్రయత్నం తప్ప ఇందులో వాస్తవాలు ప్రజలందరికీ తెలుసన్నారు. అప్రూవర్‌గా మారితే ఏ1గా తనను ఎందుకు చేరుస్తారని ప్రశ్నించారు. అసత్య ప్రచారాలు చేయడం మానాలన్నారు. రాజకీయ పరంగా ఎవరెటు పోతే ఎందుకులే అనే మనస్తత్వం తనది కాదని, విలువలతో కూడిన కుటుంబం నుంచి వచ్చానన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం చేసే క్రమంలో 8 నెలలుగా రాజకీయాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. కచ్చితంగా ఈ కేసులో ఏ1గా పెట్టడం రాజకీయమేనని, ఊరికే పార్టీలు మారే తత్వం తనది కాదన్నారు.